# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 94 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 2 డిసెంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## బాచుపల్లిలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) బాచుపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన వర్షిత (16) బాచుపల్లిలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. తానుంటున్న హాస్టల్ గదిలో వర్షిత ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

### తెలంగాణను అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్‌గా

# తీర్చిదిద్దడమే ప్రభుత్వధ్యేయం: సీఎం రేవంత్ రెడ్డి

**ఆత్మకూరు పట్టణంలో 22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి భవనానికి సీఎం భూమి పూజ**

**అమరచింతలో 15 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం**

**అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి శ్రీహరి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



అభివృద్ధి పనుల కు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

వనపర్తి జిల్లా ప్రతినిధి(ఆత్మకూరు), డిసెంబర్ 1(నమస్తే ఉదయం) తెలంగాణను అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు.సోమవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు.రూ.15 కోట్ల వ్యయంతో ఆత్మకూరు నగర అభివృద్ధి పనులకు, రూ.15 కోట్ల వ్యయంతో అమరచింత నగర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటరు భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు.ఆత్మకూరు మున్సిపాలిటీ పి. జె.పి క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ



ఆత్మకూరు లో అభివృద్ధి కార్యక్రమాలకు హెలికాప్టర్ లో వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

అధికారి కె. అరవింద్ ప్రసాద్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కు పూల బోకె ఇచ్చి స్వాగతం పలికగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి మధుసూదన్ రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, వనపర్తి జిల్లా ఎస్పీ డి.



ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సునీత,ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఇతర నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం ఆలయ పనులపైన సిఎం సమీక్షా



**గద్దెల చుట్టూ పచ్చదనం.. ఫ్లడ్లైట్ల ఏర్పాటు**

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం): మేడారం ఆలయ అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుడి చుట్టూరా పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ పనులపై జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ పనులపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. గద్దెల దగ్గరలో ఉన్న చెట్లను తొలగించవద్దని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఆలయ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడొద్దని సూచించారు. మేడారం ఆలయ నిర్మాణంలో చిన్న విమర్శలకు కూడా తావు ఇవ్వొద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గద్దెల దగ్గర నాలుగు వైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. గద్దెలకు గ్రాండ్ లుక్ వచ్చేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# విపక్షాలకు మోడీ చురకలు

**ఓటమిని కూడా అంగీకరించలేని విపక్షం**

**సమస్యలపై చర్చకు ఎప్పుడూ సిద్ధమే**

**సభా సమయాల్లో డ్రామాలు వద్దు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) బీహార్ పరాజయాన్ని కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ప్రతిపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఆయన సూచించారు. ఈ మేరకు ప్రతిపక్ష ఇండియా కూటమిపై నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా సోమవారం పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ సమావేశాల్లో అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. 'సమావేశాలు సజావుగా ముందుకు సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలి. సభా సమయాల్లో డ్రామాలు వద్దు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి. దేశ ప్రగతి కోసం పార్లమెంటులో మంచి చర్చలు కొనసాగాలి. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందు కెళ్తున్నాం. పరాజయం కూడా ఒప్పుకునే మనసు విపక్షానికి లేదు. మేము మాత్రం విపక్షాలను కలుపుకొని ముందుకెళ్తాం. దేశాభివృద్ధి కోసం విపక్షాలు కూడా మాతో కలిసి రావాలి. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి' అని ప్రధాని పేర్కొన్నారు.బిహార్ ఓటమి నుంచి ఇంకా బయటకు రాలేదంటూ ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలంటించారు. ఓటమి బాధ నుంచి బయటకు రావాలంటూ ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన సూచించారు. మీ బాధ్యతను మీరు నిర్వర్తించండంటూ ఆయా పార్టీలకు ప్రధాని హితవు పలికారు. పార్లమెంటులో బలమైన అంశాలతోపాటు ప్రశ్నలు లేవనెత్తండంటూ వారికి కీలక సూచన చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం అంటే ఈ రోజు నుంచి ప్రారంభమమ్యాయి. తమ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. చట్టసభల్లో సమయానుకూలంగా చర్చలు తప్పనిసరి అని వివరించారు. అన్ని అంశాలపై సానుకూల చర్చలు జరుగుతాయని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.ఈ పార్లమెంట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. దేశ ప్రగతి కోసం మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలని చట్టసభ సభ్యులను విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజాస్వామ్య దేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలి. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అడ్డుతగలవద్దని కోరుతున్నాను. విపక్షాలు ఓటమి నిరాశను అధిగమించాలి. అవి తమ బాధ్యతను నిర్వర్తించాలి. బలమైన అంశాలను లేవనెత్తాలి అని మోదీ

### వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు ఉపయోగపడే

# నూతన ఆవిష్కరణలు చాలా అవసరం

బుద్వేల్, డిసెంబరు 1 (నమస్తే ఉదయం) : వ్యవసాయ వ్యాపారంలో చేపడుతున్న నూతన ఆవిష్కరణలు రైతాంగానికి, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న మహిళల అభివృ ద్ధికి బాటలు వేస్తాయని నీతి అయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రమేశ్ చంద్ అన్నారు. భారతదేశ వ్యవసాయ ఆర్థిక పరిశోధన సంఘం (ఏఈఆర్ఎ) 33వ వార్షిక సమావేశం సోమవారం రాజేం ద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో జరిగింది. వ్యవసాయ వ్యాపారంలో అవిష్కరణలు, మహిళ ల సాధికరత అనే అంశంపై ఈ సదస్సులో చర్చించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ రమేశ్ చంద్ మాట్లాడుతూ, మహిళా రైతులను సాదికారత దిశలో ముందుకు తీసుకువెళ్లడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ విధానాలు రావాలన్నారు. గ్రామీణ మహిళలు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెట్ సుదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధానం వారి ఆర్థిక పరిపుష్టికి దోహదపడుతుందన్నారు. దేశంలో శ్రామిక శక్తిలో మహిళలు 34శాతం వాటా కలిగి ఉన్నారన్నారు. వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యం 12 శాతానికి పెరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో మహిళల సహకారం ఎక్కువగా ఉందన్నారు. గత రెండు దశాబ్దాలలో భారత వ్యవసాయ రంగం స్థిరమైన అభివృద్ధిని సాదించిందన్నారు. ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ, వ్యవసాయ అహార వ్యవస్థలో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. 'వ్యవసాయంలో మహిళల పాత్రను మెరుగుపరచడానికి ఉన్న సవాళ్లను అదిగిమించి ముందుకు సాగాలన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొవడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం, పెట్టుబడులు పెంచడం ద్వారా వ్యవసాయ రంగంలో



సదస్సులో మాట్లాడుతున్న నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రమేష్ చంద్

అవిష్కరణలను పెంపొందించవచ్చున్నారు. వ్యవసాయ ఆర్థిక పరిశోధన సంఘం కార్యదర్శి డాక్టర్ అంజని కుమార్ విదేశీ విద్యావేత్తల బాగస్వామ్యాన్ని సంఘంలో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. కే జోషి మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాదించే దిశలో ముందుకు సాగాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారత దేశం వివిధ దేశాలకు ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసే దిశలో ముందుకు సాగడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ సస్టెయి నబుల్ అగ్రి సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ సమరేందు మొహంతి, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ కె సూద్, నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ డాక్టర్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ నిడుమోరుతో సమంత పెళ్లి

- **రూమర్స్‌ను నిజం చేసిన జంట**

కోయంబత్తూర్ డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) టాలీవుడ్ స్టార్ నటి సమంత గత కొన్ని రోజులుగా నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. అందుకు కారణం రెండో పెళ్లే. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజ్ నిడుమోరుతో సమంత డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంత కాలంగా తెగ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. త్వరలో వీరు పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్సే నిజమయ్యాయి. సామ్-రాజ్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూర్‌లోని ఇషా యోగా సెంటర్లో గల లింగ భైరవి ఆలయంలో వీరి వివాహం జరిగింది. దక్షిణాది సంప్రదాయం ప్రకారం వీరు పెళ్లి చేసుకున్నారు. ఎరుపు రంగు కంచిపట్టు చీరలో సమంత ఎంతో అందంగా రెడీ అయ్యారు. ఉదయం నిశ్చితార్థం, ఆ వెంటనే పెళ్లి కూడా జరిగిపోయింది. ఈ వేడుకకు దగ్గరి బంధువులు, స్నేహితులు



హాజరయ్యారు. ఈ శుభవార్తను సమంత ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ఈ మేరకు పెళ్లి ఫొటోలను కూడా షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, అభిమానులు సామ్-రాజ్ జంటకు శుభకాంక్షలు చెబుతున్నారు. పలువురు సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం



**9 వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం**

**గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి**

**ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా**

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే.అనేక కుట్రలు ఉన్నాయని నేతలు ఆరోపించారు.




# పోలీస్ కిష్టయ్య త్యాగం మరువలేనిది

## నీలం మధు ముదిరాజ్

## ఘనంగా కిష్టయ్యకు నివాళులు

పటాన్ చెరు, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన పోలిస్ కిష్టయ్య త్యాగం మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇంఛార్జి నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో పోలీస్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కిష్టయ్య చిత్రపటానికి నీలం మధు ముదిరాజ్ పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా తనని తాను కాల్చుకుని ప్రాణాలు అర్పించిన వీరుడు కిష్టయ్యేనని ఆయన అన్నారు. పోలీస్ కిష్టయ్య త్యాగాన్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని, వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా చెదరని ముద్ర వేసుకున్నారని ఆయన అన్నారు. కిష్టయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు.



డీఎంఏ శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# మున్సిపాలిటీలలో సమస్యలు పరిష్కరించాలి:

## (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఏసురత్నం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఏసురత్నం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ , కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ , డాక్టర్ టి.కే.శ్రీదేవి ఐఏఎస్ ని కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యేసురత్నం, జైపాల్ రెడ్డి లు రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొన్ని జిల్లాల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు . ఖమ్మం జిల్లాలోని 15 మందిని ఔట్ సోర్సింగ్ లోకి తీసుకోవాలని ,కల్లూరు మున్సిపల్ లో ఐదు నెలల నుండి కార్మికులకు జీతాలు రావడం లేదని వివరించారు. కార్మికులు అప్పులు చేసి విధులు నిర్వహిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వైరా మున్సిపల్ లో 50 మంది కార్మికులని స్పెషల్ డ్రైవ్ పేరుతో కార్మికులతో పారిశుధ్య పనులు చేయించు కుంటున్నారనీ వారికి 10వేలు రూపాయలు మాత్రమే ఇస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అన్ని మున్సిపాలిటీలలో ఇచ్చినట్లు 16,500 వెంటనే అమలు చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా మున్సిపల్ వాటర్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్న కార్మికులని పారిశుధ్య పనులు చేయాలని చెప్పడం సరి అయింది కాదని వారిని యధావిధిగా వాటర్ వర్క్స్ లో కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికులందరికీ 15 క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు, ఐడి కార్డులు, అమలు చేయాలని కోరడం జరిగింది. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. మున్సిపల్ లో మరణించిన కార్మికులకు దాన సంస్కారాల ఖర్చులు 30 వేలు ఇవ్వాలని కోరడం జరిగింది. కమిషనర్ శ్రీదేవి అందుకు సానుకూలంగా స్పందించి మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు అన్నిటిని పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలలో కనీస వేతనాలు రూ:26 వేలు ఇవ్వాలని మీ యొక్క యూనియన్ ఇచ్చిన వినతి పత్రాన్ని మా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతానని చెప్పడం జరిగింది.

# బొల్లారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా తూపల్లి సాయికిరణ్ రెడ్డి..!



పటాన్ చెరు, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) బొల్లారం మున్సిపల్ బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడిగా తూపల్లి సాయికిరణ్ రెడ్డి నియమితులైనట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వినికిడి. బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ గా ఆయన గతంలో ఎన్నికయ్యారు. ఇటీవల పదవీకాలం ముగిసిన తర్వాత ఆయన సేవలు గుర్తించి పార్టీ ఆయనకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారని సమాచారం.

# విపక్షాలకు మోడీ చురకలు

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. గత పదేళ్లుగా ప్రతిపక్షాలు ఆడుతున్న ఆట దేశ ప్రజలకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. వారికి కొన్ని టిప్స్ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని ప్రధాని విపక్షాలకు చురకలంటించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశాభివృద్ధి మాత్రమేనని వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈసారి పార్లమెంట్ సెషన్ కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు బాటలు పరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశాలు ప్రారంభంకాగా, ఇవి ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు రోజులు మినహా మొత్తం 15 రోజులపాటు ఈ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులు ఆమోదం పొందనున్నాయి. ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించ వద్దని విపక్షాలను కోరామన్నారు. దాదాపు గంటన్నర పాటు ఈ అఖిలపక్ష భేటీ జరిగింది. ఈ భేటీలో విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు.



విద్యా విజ్ఞాన యాత్ర లో కమ్యూనిటీ సైన్స్ విద్యార్థులు

# విద్యార్థుల ఆలోచన విధానాలను పెంపొందించడానికి విద్యా విజ్ఞాన యాత్రలు దోహదం

బుద్వేల్, డిసెంబరు 1 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కమ్యూనిటీ సైన్స్ కళాశాల విద్యార్థుల దక్షిణ భారత విద్యా విజ్ఞాన యాత్ర మంగళవారం తో ముగియనుంది. ఈ పర్యటనలో బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్ఎర్), సెంట్రల్ సిల్క్ బోర్డు, నేషనల్ డైరీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, కొచ్చిలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కోయంబత్తూర్ లోని సౌత్ ఇండియన్ టెక్స్ టైల్స్ రీసెర్చ్ అసోసియేషన్, ఊటీలోని చాక్లెట్ ప్యాక్టరీ, బంగాళదుంప పరిశోధన కేంద్రం, మైసూర్ లోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ సంస్థలను సందర్శించారు. ఈ విద్యా పర్యటన విద్యార్థులలో శాస్త్రీయ పరిశోధన విధానాల గురించి తెలుసుకోవడానికి ఎం తగానో దోహదపడిందని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు అంటున్నారు.





జర్నలిస్టుల సమస్యలపై చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కమిటీ ప్రతినిధులు

# జర్నలిస్ట్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన మహాధర్న విజయవంతం చేయాలి: శ్రీకాంత్ రెడ్డి

## ఎల్ బి నగర్ లో మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ

ఎల్ బి నగర్, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూ జె) ఆధ్వర్యంలో ఈ నెల 3న హైదరాబాద్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్య నారాయణ ' జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్ , జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంపు కన్వీనర్ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్ జోన్ ఇంచార్జ్ లు దశరథ. శ్రీనివాస్ ఆవిష్కరించారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. జర్నలిస్ట్ జీవితాలు గత పుష్కర కాలంలో ఏ మాత్రం మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. 10 ఏళ్ల పాలనలో టిఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం పరిమితమయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పయనిస్తుందన్నారు. జర్నలిస్టులకు అక్రెడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. అరులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని తెలిపారు. వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలి అనే అంశాల ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి అరులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సంక్షోభంలో ఉన్న చిన్న మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలన్నారు. జర్నలిస్టుల డిమాండ్ల పై ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జర్నలిస్టులు అందరూ ధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి మన సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మల్లేష్ గౌడ్, గణేష్, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, మహేష్, ఉదయ కుమార్ పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకల నిర్వహకు ముందస్తు అనుమతి తీసుకోవాలి

## కమిషర్ అవినాష్ మోహంతి



శేరిలింగంపల్లి ,డిశంబర్ 1 (నమస్తే ఉదయం) సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో రానున్న నూతన సంవత్సరం 2026 వేడుకలను నిర్వహించే ఈవెంటు మేనేజ్ మెంటు సంస్థలు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషర్ అవినాష్ మోహంతి సూచించారు. నూతన సంవత్సరం 2026ను పురస్కరించుకొని డిసెంబర్ 31న వివిధ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు వేడుకలు నిర్వహించే అవకాశం ఉన్నందున కమిషనర్ అనుమతులు తప్పనిసరని వివరించారు. ఈవెంట్లు నిర్వహించదలచిన నిర్వాహకులు డిశంబర్ 21లోపు తప్పనిసరిగా cybpms.telangana.gov.in వెబ్ పోర్టల్ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. టికెట్‌తో జరిగే న్యూ ఇయర్ ఈవెంట్లకు కమర్షియల్ టికెటెడ్ ఈవెంట్స్ ఫారం టికెట్ లేని ఈవెంట్లకు నాన్ కమర్షియల్ నాన్ టికెటెడ్ ఈవెంట్స్ ఫారంను ఎంపిక చేసుకోవాలి వివరించారు. డిశంబర్ 21 తర్వాత సమర్పించిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవన్నారు.



జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు వినతిపత్రం అందజేస్తున్న బొల్లారం మాజీ చైర్ పర్సన్ కొలన్ రోజారాణి

# బొల్లారం మున్సిపాలిటీగానే కొనసాగాలి

## బొల్లారం మాజీ చైర్ పర్సన్ కొలన్ రోజారాణి

పటాన్ చెరు,డిసెంబర్ 1(నమస్తే ఉదయం): ప్రస్తుతం మున్సిపాలిటీగా ఉన్న బొల్లారాన్ని జిహెచ్ఎంసిలో విలీనం చెయ్యకుండా,మున్సిపాలిటీ గా కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కు స్థానిక నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బొల్లారం మాజీ చైర్ పర్సన్ కొలన్ రోజారాణి నేతృత్వంలో బొల్లారం మాజీ కాన్సిల్లర్లు బి.సంధ్యజైపాల్ రెడ్డి,శైలజ పుండరికం, సాయి కిరణ్ రెడ్డి,మన్నే సతీష్ ముదిరాజ్,బీరప్ప యాదవ్, వి.శ్రీకాంత్ యాదవ్,ప్రభు నాయక్, మాజీ ఎంపీటీసీ అరూర్ రత్నం , మాజీ వార్డు సభ్యులు శారద లు వినతి పత్రం అందించినవారిలో ఉన్నారు.

# హైదర్ గూడలో గీతా జయంతి







గీతా జయంతి లో పాల్గొన్న భక్తులు



బుద్వేల్, డిసెంబరు 1 (నమస్తే ఉదయం): హైదర్ గూడ ప్రణవ భక్త సమాజం, వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో సోమవారం 47వ గీతా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అయ్యప్ప స్వాములతో పాటు ప్రణవ భక్త సమాజం, వీరాంజనేయ భక్త సమాజం సభ్యులు హైదర్ గూడ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. భగవద్గీత పారాయణం, భక్తి పాటలు పాడుతు ఊరేగింపులో ముందుకు సాగారు. హనుమాన్ దేవాయలంలో గీతాజయం తి తో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 47 సంవత్సరాల నుంచి గీతా జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తు వస్తున్నామని ప్రణవభక్త సమాజం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం సభ్యులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మొంద్ర నర్సింహ్మా, అశోక్, బర్ల మల్లారెడ్డి, బజరంగ్ రెడ్డి, కొండమీద హరినాథ్, ఎం. బాలసుబ్రమణ్యం, మొంద్ర ఐలయ్య, జి.పుల్లారెడ్డి, కాకులారం క్రిష్ణ, వెంకటేశ్, ఎస్ బి హరినాథ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





అత్తాపూర్ అంబియన్స్ ఫోర్ట్ కాలనీ లో అనుమతి లేని నిర్మాణాల కూల్చి వేత్తలు

# అంబియెన్స్ ఫోర్ట్ కాలనీలో అనుమతి లేని విల్లాల కూల్చివేత

బుద్వేల్, డిసెంబరు 1 (నమస్తే ఉదయం): అత్తాపూర్ అంబియెన్స్ ఫోర్ట్ కాలనీలో నిభందనలకు విరుద్ధంగా నిర్మించిన ఓ విల్లాను సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నాలుగు అంతస్థులలో ఉన్న ఈ విల్లాలోని స్లాబులను రంధ్రాలు చేశారు. ఇటీవల కాలనీ లోని మెజారిటీ ప్రజలు అంబియెన్స్ ఫోర్ట్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్థు భవనాలు నిర్మిస్తుండటంతో డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సమస్యలు, పార్కింగ్ సమస్య, రోడ్ల సమస్యలు తలెత్తుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దాంతో స్పందించిన రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు లేకుండ నాలుగు అంతస్తులలో నిర్మించిన 56వ విల్లాను ధ్వంసం చేశారు.

# ఎన్నికల వ్యయముల ఖాతా నిర్వహణ పత్రాలను నామినేషన్ వేసిన వారికి అందజేయాలి



పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్



తాటికుంట పంచాయతీ కార్యాలయం సందర్శించిన కలెక్టర్ సంతోష్



ఎన్నికల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

## కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన ప్రతి అభ్యర్థికి ఎన్నికల వ్యయముల ఖాతా నిర్వహణ పత్రాలను విధిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు.సోమవారం మల్దకల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన మల్దకల్ 1, ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మల్దకల్ 2, తాటికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్స్ ప్రకారం సంబంధిత అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలనీ రిటర్నింగ్ అధికారులకు సూచించారు.. పోటీ చేయు అభ్యర్థుల నుంచి అవసరమైన ధృవపత్రాలను తీసుకొని విధిగా దరఖాస్తుకు జత పరచాలని, డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో నిర్దేశిత డిపాజిట్ తీసుకొని తగిన రసీదును ఇవ్వాలని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులను పెండింగ్ లేకుండా కట్టించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఇతర అంశాలపై ముద్రించిన పత్రాలను నామినేషన్ వేసిన వారికి అందజేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను పరిశీలించారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో ఏ రోజుకు ఆ రోజు అతికించాలన్నారు. హెల్ప్ డెస్క్ ను పరిశీలించి నామినేషన్ వేసేందుకు వచ్చే వారికి అవసరమైన సలహాలు అందజేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. నామినేషన్స్ వేసిన అభ్యర్థుల వివరాలను టీ పోల్ యాప్ లో నమోదు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత నామినేషన్ వేసేందుకు వచ్చేవారిని కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని, నిర్దేశిత సమయంలోగా కేంద్రం లోపల ఉన్న వారి నుంచి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఈ పర్యటనలో మల్దకల్ మండలం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, ఎంఈఓ సురేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## దర్గా భూమిని భూభారతిలో ఎక్కించండి

### కలెక్టర్‌కు వినతి

గద్వాల, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) గద్వాల శివారులోని సర్వే నెంబర్ 352లో 0.32 గుంటల దర్గా భూమిని భూ భారతిలో ఎక్కించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో దర్గా ధర్మకర్తలు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గద్వాల శివారులోని సర్వే నెం. 352 విస్తీర్ణత 0-32 గుంటల భూమి ఖాస్రా, ఆర్ఓఆర్ రెవెన్యూ రికార్డు ప్రకారం పీర్ జాద దర్గా పేరిట వున్నది, అట్టి సర్వే నెంబర్ యందు మా పూర్వీకులు అయిన సయ్యద్ షా అలి అసదుల్ల హుస్సేని, సయ్యద్ షా కుతుబుల్ల హుస్సేని, సయ్యద్ షా మినల్ల హుస్సేని ల సమాదులు కూడ వున్నాయన్నారు. ఈ భూమిని భూ భారతి లో నమోదు చేయలేదన్నారు. పీర్ జాద దర్గా పేరిట వున్న భూమిని భూభారతి లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మకర్తలు సయ్యద్ కుతుబ్ హుస్సేని, సయ్యద్ మఖ్దూం సయ్యద్ జావీద్, సయ్యద్ అజ్హర్, సయ్యద్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పక్రియను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్

## నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగాలి

### ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01(నమస్తే ఉదయం): జనగాం మండలం శామిర్పేట్, బచ్చన్నపేట మండలం, పొచ్చన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయం లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఎన్నికల అబ్జార్వర్ రవి కిరణ్ పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన నామినేషన్ వివరాలు, టి పోల్ ఎంట్రీ ప్రక్రియ ని పరిశీలించి ఎన్నికల విధులకు సంబందించిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయాని అధికారులను అబ్జార్వర్ అడిగి తెలుసుకున్నారు.ఇంతకు ముందు ఎలక్షన్ డ్యూటీ లు ఏమైనా చేసారా అని అడిగి తెలుసుకొని.. నామినేషన్ ప్రక్రియ సాఫిగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు.రెండవ దశ కి సంబందించి నామినేషన్ కి చివరి తేదీ నేడే కాబట్టి గ్రామపంచాయతీల్లో నామినేషన్ మీద అవగాహన కల్పిస్తూ టామ్ టామ్ వేపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమం లో మండలాల తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు పాల్గొన్నారు.



## ఆయుష్మాన్ ఆస్పత్రిలో గైనకాలజీ సేవలు

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01(నమస్తే ఉదయం): జిల్లా కేంద్రంలోని ఆయుష్మాన్ హాస్పిటల్లో గైనకాలజీ సేవలు ప్రారంభించినట్లు ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో మరిన్ని ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పించామన్నారు. పేషంట్ల సౌకర్యార్థం లేడీ గైనకాలజిస్ట్ మహిళలకు పూర్తి వైద్య సహకారం, సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేశ్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకులతో మాట్లాడుతున్న సీఐ

## బాణాపురంలో అండర్పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సిపిఎం రాస్తారోకో

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01(నమస్తే ఉదయం):: జనగామ పట్టణంలో హైదరాబాద్ రోడ్డు నుండి సిద్దిపేట కలుపుతూ ఎన్ హెచ్ హైవే బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బాణాపురంలో అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ గతంలో 132 రోజులు రిలే దీక్షలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ హైవే అధికారులు ఆర్డీవో దీక్ష దగ్గరికి వచ్చి తప్పకుండా అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. తిరిగి రాత్రి ఇరువైపులా రోడ్డు మీద మట్టి పోస్తున్నారని, తెలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఎన్ హెచ్ అధికారులు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఇదే సందర్భంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్పందించి అండర్ పాస్ బ్రిడ్జిని త్వరగా వేయించాలని వారు అన్నారు. లేకపోతే ఇక్కడికి వెళ్లి గ్రామాలు ఏసి రెడ్డి నగర్ మూడో విడత ఇందిరమ్మ ఇండ్లు, ఎల్లముల, శ్రీనివాసపురం, సిద్దంకి, పెదరాంచర్ల పోచన్నపేట, గ్రామాలను కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న జనగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి రాస్తారోకో దగ్గరికి వచ్చి ఎన్ హెచ్ అధికారులతో మాట్లాడి రోడ్డును బ్లాక్ చేయకుండా చూస్తామని అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బూడిది ప్రశాంత్, నాయకులు ధరవత్ మహేందర్, పల్లెర్ల శంకర్, రాగాల్ల అంజయ్య, ఆడ రమేష్, పాము బిక్షపతి, మంద నరసింహులు, పసులాది హరీష్, శ్రీకాంత్, చింతల బాబు, వసంత, రేణుక, పద్మ, కంతి ఆంజనేయులు, మురళి, ఎండి మునీర్, యాకమ్మ, మౌనిక, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గద్వాల ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుండి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే సోమవారం ఉదయం ధరూర్ మండలం చిన్న చింత రేవుల గ్రామ సమీపంలో ఆత్మకూరుకు చెందిన అవీజ్ అనే ఒక వ్యక్తి గద్వాలలో గంజాయి విక్రయించడానికి బైక్ మీద వస్తున్న క్రమంలో గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు లు వెంకటేష్ , వీరేశలింగం, శివ కృష్ణ, పోలీసులు తనిఖీ చేయగా 150 గ్రాముల గంజాయి లభ్యమయింది. గంజాయిని గద్వాలలో విక్రయించడానికి తీసుకు వస్తున్నట్లు విచారణలో తేలింది. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుని మీద ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు లు వెంకటేష్ , వీరేశలింగం, శివ కృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తొర్రూరు(జె) బిఆర్ఎస్ నాయకులు

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01(నమస్తే ఉదయం): పాలకుర్తి నియోజక వర్గ కేంద్రంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి సమక్షంలో తొర్రూరు(జె) గ్రామంలో వడ్డెర కాలినికి చెందిన అలకుంట్ల వెంకన్న ఆధ్వర్యంలో సుమారు 100 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ చేరికలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారయణ, మండల అధ్యక్షుడు గిరగని కుమారస్వామి, తొర్రూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలివేరు బాలరాజు, ఏఎంసి వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, ఓబీసీ సెల్ స్టేట్ కో కోఆర్డినేటర్ పులి గణేష్, పసులది ఐలయ్య, బత్తోజు రామస్వామి, బొమ్మిశెట్టి ఎల్లయ్య, బొమ్మిశెట్టి ఐలయ్య, వల్లేపు మల్లయ్య, బొమ్మిశెట్టి శ్రీను, బొమ్మిశెట్టి కుమార్, పులి భాస్కర్, గ్రామ ముఖ్య కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.ద

## ఐక్య పోరాటాలతోనే సకల సమస్యలు పరిష్కారం

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి జయలక్ష్మి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) అన్ని రంగాల కార్మికులు చేసే ఐక్య, సమరశీల పోరాటాల వల్లే సకల సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి జయలక్ష్మి అన్నారు.సోమవారం అనంత ఫంక్షన్ హాల్ లో జరిగిన సిఐటీయూ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద,సరళీకరణ విధానాల వల్ల ప్రభుత్వ రంగం పాత్ర తగ్గి ప్రైవేట్ రంగం పాత్ర పెరిగి విచ్చలవిడిగా పెరిగి శ్రమ దోపిడీకి కారణం అవుతున్నాయని విమర్శించారు.అన్ని రంగాల కార్మికులు చేసే ఐక్య పోరాటాల ద్వారానే సకల సమస్యల పరిష్కారం అవుతాయని ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల ఆదాయాలను పెంచే చర్యలు ఏమాత్రం చేపట్టడం లేదని విమర్శించారు.విధానాల అమలులో బిజెపి, కాంగ్రెస్,బిఆర్ఎస్ కు పెద్ద తేడా లేదని విమర్శించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పరంజ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాస్ మాట్లాడుతూ ఆర్థిక,సామాజిక అసమానతలు లేని సమాజం కోసం సిఐటియు చేస్తున్న పోరాటాలకు తమ సంఘాలు ఎప్పుడు మద్దతు ఉంటాయని తెలిపారు. కార్మికుల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి రాజీ లేని పోరాటం చేసే ఏకైక సంఘం సిఐటియు అన్నారు.అనంతరం



23 మందితో సిఐటియు నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు : ఉప్పేరు నరసింహ జిల్లా కార్యదర్శి : వివి నరసింహ జిల్లా కోశాధికారి :ఘట్టన్న, ఉపాధ్యక్షులుగా ఏమెలమ్మ, మాశపోగు వెంకటేశ్వర్లు,బి. ఈశ్వర్ సహాయ కార్యదర్శులుగా సునీత,తిమ్మప్ప, రామకృష్ణ కమిటీ సభ్యులుగా శాంతమ్మ, చెన్నమ్మ, లక్ష్మన్న, రంగా రావు, నరేష్, మద్దయ్య, శివ, బీచుపల్లి,సంజీవరాజు, జయాకర్, సీతారాం,పద్మ, రజాక్, సలోమి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర నాయకులు తీర్మానాలు ప్రకటించారు. జిల్లాలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ని ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగు లందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక సమస్యను పరిష్కరించి ఉపాధి కల్పించాలన్నారు. హమాలీలకు ఆటో కార్మికులకు ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేసి పని గ్యారంటీ ఇవ్వాలి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. వలస కార్మికులకు అంతరాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని పకడ్బందీగా మరి చేయాలి.తదితర తీర్మానాలను ఏకగ్రీవంగాఆమోదించుకున్నారు.

## "వైభవంగా గీతాజయంతి - శౌర్య దినోత్సవ వేడుకలు"

### భగవద్గీతని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

### ప్రత్యేక సంస్కృత విభాగాన్ని విద్యాశాఖలో ఏర్పాటు చేయాలి : మోహనకృష్ణ భార్గవ

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01(నమస్తే ఉదయం) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గ్రెయిన్ మార్కెట్, శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయంలో సోమవారం భగవత్ 'గీతా జయంతి - శౌర్య దినోత్సవ' వేడుకలను వైభవంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, యువకులు పాల్గొని శ్రీ కృష్ణుడి విగ్రహానికి ఆరాధనలు జరిపారు. దేవాలయ అర్చకులు పిట్టల రాములు స్వామి మహానీరాజనం, మహా మంత్రపుష్పం, పుష్పార్చనలు జరిపారు. అనంతరం భక్తులందరూ కలిసి భగవద్గీత పఠనం చేసారు. ఈ కార్యక్రమంలో అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ పాల్గొని ప్రసంగించి భగవద్గీత ప్రాముఖ్యతను తెలిపారు. యువత హిందూ ధర్మ పరిరక్షకులుగా నిలవాలని సంకల్పం, ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ భగవద్గీత సకల వేద సారమని దుష్ట శిక్షణ, శిష్ట రక్షణార్థం సాక్షాత్ నారాయణుడు శ్రీకృష్ణ పరమాత్మగా అవతరించి మానవాళికి ధర్మాన్ని, గీతను బోధించి గీతాచార్యుడుగా నిలిచాడని అన్నారు. జీవి పుట్టుక నుండి మరణం వరకు ప్రతీ సందేహానికి సమాధానం గీత అందించే అనంత జ్ఞాన భాండాగారమని అన్నారు. భగవద్గీత ప్రతీ గృహంలో తప్పక ఉండాలని, అలంకార ప్రాయం కాకుండా చదివి జీవితాన్ని సన్మార్గంలో నడవాలి అన్నారు. పాఠ్యపుస్తకాల్లో భగవద్గీతను చేర్చాలని, విద్యాలయాల్లో ప్రత్యేక సంస్కృత విభాగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. నిరంతరం హిందూ ధర్మం మీద, దేవాలయాల మీద దాడులు జరుగుతున్నాయని, కురుక్షేత్ర యుద్ధంలో ధర్మం ఏ విధంగా అయితే విజయం సాధించిందో, అదే విధంగా నేడు హిందువులు సంఘటితమై ధర్మ పోరాటాన్ని జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ చిలువేరు హర్షవర్ధన్, కుందారపు బైరునాథ్, శివరామ్, సనత్ మరియు ఆలయకమిటీ సభ్యులు మాడిశెట్టి రవి, వెంకన్న, కందుకూరి కైలాసం, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



గీత పారాయణం చేస్తున్న మోహనకృష్ణ భార్గవ

# ప్రజలకు హక్కులే కాదు బాధ్యతలూ ముఖ్యమే

### బొల్లారం మున్సిపల్ కమీషనర్ కిషన్

### కమీషనర్ తో "నమస్తే ఉదయం" ముఖాముఖి



పటాన్ చెరు, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) ప్రజలు తమ హక్కులను ఎలా పరిరక్షించుకునేందుకు పాటు పడతారో అదేవిధంగా బాధ్యతలనూ సక్రమంగా నిర్వర్తించాలని బొల్లారం మున్సిపల్ కమీషనర్ బి కిషన్ పేర్కొన్నారు.

- ప్రశ్న: బొల్లారం లో మీ బాధ్యతలు ఎలా ఉన్నాయి..?
- కమీషనర్: తనను బొల్లారం ప్రజలు అక్కున చేర్చుకున్నారు. తనతో ఎల్లప్పుడూ సామరస్యంగా వ్యవహరించారు.
- ప్రశ్న: ముఖ్యంగా మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి ...?
- కమీషనర్: బొల్లారం మున్సిపల్ ప్రాంతంలో పారిశుధ్యం అతి పెద్ద సవాలు.
- ప్రశ్న: ఆ సవాలును మీరు అధిగమించారా...?
- కమీషనర్: పూర్తిగా అధిగమించామని చెప్పలేను... కానీ కొంతమేరకు పరిష్కారం దొరికింది.
- ప్రశ్న: ఎలాంటి పరిష్కారం దొరికింది..?
- కమీషనర్: ప్రజలు గతంలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ప్రజలకు బాధ్యత పెరిగింది చెత్తను మున్సిపల్ చెత్త తరలించే వాహనాల్లో వేస్తున్నారు.
- ప్రశ్న: ప్రజల్లో ఎలాంటి మార్పు వచ్చిందని అనుకుంటున్నారు...?
- కమీషనర్: మున్సిపల్ మార్గదర్శకాలు,నిబంధనలు చాలామంది పాటిస్తున్నారు.
- ప్రశ్న : ప్రజల సహకారమేనా, ప్రజాప్రతినిధుల సహకారం గురించి ఏమైనా చెప్పగలరా...?
- కమీషనర్: ప్రజల కోసం ప్రజాప్రతినిధుల సహకారం కూడా పూర్తిస్థాయిలో లభిస్తోంది.
- ప్రశ్న: ఎలాంటి సహకారం...?
- కమీషనర్: ముఖ్యంగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి సహకారం మెండుగా ఉంది. ఆయనతోపాటు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కూడా పూర్తిస్థాయిలో ఉంది.
- ప్రశ్న: ఎమ్మెల్యే సహకారంతో ఎలాంటి అభివృద్ధి చేస్తున్నారు...?
- కమీషనర్: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గారి సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసాం. ముఖ్యంగా యువతకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి చేస్తున్న సన్నాహాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, స్థానిక నాయకుల సహకారమే నిదర్శనం.
- ప్రశ్న: ఇంతవరకు ఎంతమేరకు నిధులు ఖర్చు చేశారు..?
- కమీషనర్: మున్సిపల్, యుజిడి నిధుల నుంచి రూ 2.75 కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంతర్గత రహదారులు నిర్మాణం చేసాం.
- ప్రశ్న: ఇటీవల రోడ్డు విస్తరణ కోసం చేపట్టిన పనులు ఎంతవరకూ వచ్చాయి..?
- కమీషనర్: భవిష్యత్తు అవసరాల కోసం రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఆ పనులు కొనసాగుతున్నాయి
- ప్రశ్న: రోడ్డు విస్తరణ పనులకు అవాంతరాలు ఎదురైనాయా...?
- కమీషనర్: అలాంటిది ఏమీ లేదు, ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. కాబట్టి మాకు ప్రజల సహకారం లభించిందని చెప్పగలను.
- ప్రశ్న: ఆక్రమణల తొలగింపు, రహదారి విస్తరణపై రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా వచ్చాయా...?
- కమీషనర్: ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు, అందరూ మద్దతు ఇస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల సహకారం కూడా చాలా ఉంది కాబట్టే ఈ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టాం.
- ప్రశ్న: ఉన్నట్టుండి రహదారి విస్తరణ పనులు ఎందుకు చేపట్టారు.?
- కమీషనర్: ఇప్పటికే బొల్లారం మున్సిపల్ పరిధిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్లనే రహదారి విస్తరణ పనులు చేపట్టాం. దీనివల్ల కొంతమేరకు ఇబ్బందులు తలెత్తినా భవిష్యత్తు అవసరాల కోసం ఇది అనివార్యం. ఈ విషయంలో ప్రజల సహకారం అభినందనీయం.
- ప్రశ్న: మీ ఈ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు...?
- కమీషనర్: బొల్లారంలో కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం లేదు. దీని కోసం హెచ్ఎండిఎ అధికారులతో మాట్లాడి ఒక పార్కు అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టడం జరిగింది.
- ప్రశ్న: పార్కు నిర్మాణం ఎక్కడ చేపడుతున్నారు..?
- కమీషనర్: బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 81,84 లలో ఈ పార్కు నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించడం జరిగింది. ప్రజలకు సౌకర్యవంతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పార్కు నిర్మాణం చేపడతాం.
- ప్రశ్న: ప్రజలకు బస్టాండు సమస్యపై చర్యలు ఏమైనా తీసుకున్నారా..?
- కమీషనర్: ప్రజలకు రవాణా సదుపాయం పెంచాలని, బస్టాండు ఏర్పాటు చేయాలని ఇప్పటికే మియాపూర్ బస్ డిపో మేనేజర్ కు విన్నవించడం జరిగింది. దీనిపై త్వరలో సానుకూల నిర్ణయం వస్తుంది.
- ప్రశ్న: మహిళల అభ్యున్నతి కోసం ఏమైనా చర్యలు చేపట్టారా...?
- కమీషనర్: మహిళా స్వయం సహాయక సంఘాలకు సహాయం కోసం ప్రణాళికలు సిద్ధం చేసాం. ఆచరణ రూపం దాల్చాల్సి ఉంది.
- ప్రశ్న: అభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు తయారు కదా.. నిధులు ఎలా సమకూర్చుతారు...?
- కమీషనర్: వివిధ పన్నుల రూపంలో ఇప్పటివరకూ డెబ్బై శాతం వరకు వసూలు చేసాం. ప్రభుత్వం కేటాయించిన నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఉపయోగిస్తాం.
- ప్రశ్న: ఆఖరి ప్రశ్నగా.. ప్రజలకు మీరు ఏం సూచించాలనుకుంటున్నారు..?
- కమీషనర్: మీరు మీ హక్కుల కోసం ఎలా ప్రశ్నిస్తారో... అలాగే మీ బాధ్యతలనూ నెరవేర్చండి. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని సూచిస్తాను.



జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

## సిగాచి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: మెట్టుశ్రీధర్

పటాన్ చెరు, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం): నిర్లక్ష్య వైఖరితో పదుల సంఖ్యలో కార్మికులను పొట్టన పెట్టుకున్న సిగాఛి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ , ఎస్.పి లకు బిఆర్ ఎస్ నాయకుడు, నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ వినతి పత్రం సమర్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలను మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావుకి గత వారం అందించడం జరిగిందని హరీష్ రావు రాసిన లేఖలో 2018 నుండి 2014 వరకు ఫ్యాక్టరీ తనిఖీలలో అనేక మార్లు ఉల్లంఘనలు జరిగినా కంపెనీ యజమాన్యం సరిదిద్దుకోకపోవడం కారణంగానే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లడుతూ... సిగాచి కేసులో తాను సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన ఆధారాలు కంపెనీ యజమాన్యం అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేసాయని ప్రతీ ఒక్కరు సమాచార హక్కు చట్టం ఉపయోగాలు తెలుసుకుని సమాజశ్రేయస్సు కోసం దానిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

## బృందావన్ కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటన

బుద్వేల్, డిసెంబరు 1 (నమస్తే ఉదయం): మైలార్ దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీ లో డ్రైనేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జలమండలి సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సూచించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సోమవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జలమండలి సిబ్బంది తో కలసి బృందావన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భం గా స్థానిక ప్రజలు తాము డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు ఎదురైన వెంటనే అధికారులు స్పందిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉం డవని కార్పొరేటర్ గుర్తు చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్పొరేటర్ వెంట నాయకులు పాండు యాదవ్, రావుల భాస్కర్, సి.బుచ్చిరెడ్డి, బబ్లు, తలారి చిన్న, శ్రీకాంత్ రెడ్డి, ఎల్ వి రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి , వివేక్, జంగయ్య, జైరాం, పండరీనాథ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



బృందావన్ కాలనీలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి

# పూర్తి కానీ పనులను వేగవంతగా పూర్తి చేయాలి

### హెచ్ఎండిఏ కమిషనర్ శశాంక

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి పూర్తి కానీ పనులను వేగవంతగా పూర్తి చేయాలని హెచ్ఎండిఏ కమిషనర్ శశాంక అధికారుల కు సూచించారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌పై ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక , రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, ప్రిన్సిపల్ పౌర సరఫరాల శాఖ సెక్రటరీ , కమిషనర్ డి.ఎస్.చౌహాన్ లతో కలిసి అన్ని విభాగాల హెచ్ ఓ డి లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్లోబల్ సమ్మిట్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వివిధ దేశాల నుండి, రాష్ట్రాల నుండి వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నీ రకాల సదుపాయాలను కల్పించాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లు



జరగకుండా తమకు కేటాయించిన పనులను ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, ఇంటర్నెట్ సౌకర్యంలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. రవాణా సౌకర్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, హెలిప్యాడ్లు, పార్కింగ్ స్థలాల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. మెడికల్ సిబ్బందితో అవసరమైన వద్ద శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ కు వివిధ ప్రాంతాల నుండి దేశాల నుండి డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుండి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్లు పరిశుభ్రంగాఉండాలని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతంలో పారిశుద్ధ్యం చేపట్టాలని చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, రోడ్లపై ఎక్కడ ఎలాంటి చెత్త లేకుండా చూడాలని సూచించారు. మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిపక శాఖ అధికారులు ఎలాంటి సంఘటనలు జరగకుండ చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లుకు తావ్వివకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులని బాధ్యతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో ప్రోటోకాల్ సెక్రటరీ నర్సింహా రెడ్డి, అధికారులు ప్రేమ్ రాజ్, జలమండలి ఎండి కె.అశోక్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, ఆర్ అండ్ బి, ఫైర్ సేఫ్టీ, ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, టిజిఎస్పీడిసిఎల్, టూరిజం, ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పరిపాలన అధికారుల నూతన కమిటీ కి సన్మానం చేస్తున్న సభ్యులు

## కేటిదొడ్డి మండలం నూతన జిపిఓ కమిటీ ఎన్నిక

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1(నమస్తే ఉదయం) కేటీదొడ్డి మండలం గ్రామ పరిపాలన అధికారుల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జీపీఓ సంఘం మండలాధ్యక్షులుగా పాంచజన్య, కోశాధికారిగా ఆంజనే యులు, ప్రధాన కార్యదర్శిగా వీరేందర్, కార్యవర్గ సభ్యులుగా చింతరేవుల ఆంజనేయు లు, కావలి గోవర్ధన లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జీపీఓ కార్యవర్గానికి తహసీల్దార్ హరికృష్ణ అభినందనలు తెలిపి, శాలువతో సన్మానించారు.



## ఘనంగా శ్రీ మహాశాస్తా అయ్యప్ప స్వామి 12వ వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

కూకట్‌పల్లి, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజక వర్గం లోని కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని అవీబీ పురం లోని శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక సహిత మల్లిఖార్జున స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో కొలువైన శ్రీ మహాశాస్తా అయ్యప్ప స్వామి 12 వ వార్షికోత్సవం సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, గొట్టిముక్కల దేశాల్, మేకల రమేష్, ఫాల్గుణ రావు, ఆర్ వాసు, వినోద్ కుమార్, చంద్రరావు, లక్ష్మి నారాయణ, జైరామ్, పాపారావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## యువతలో నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యంపై శ్రద్ద కలిగి ఉండాలి

### కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) యువత నాయకత్వ లక్షణాలతో పాటు శారీరక దారుఢ్యం పై శ్రద్ధ కలిగి ఉండాలని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. అదివారం కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో గల లోధా అపార్ట్మెంట్ దగ్గర క్రికెట్ గ్రౌండ్ లో జనసేన నాయకుల యాక్టివ్ ఫిట్నెస్ టెస్ట్ - ఆదివారం ఆటవిడుపు కార్యక్రమాన్ని జనసేన నాయకులు పోలేబోయిన శ్రీనివాస్ నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ లకు కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మ్యాచ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ జనసేన నాయకులకు ఇలాంటి ఆటవిడుపు కార్యక్రమాలు టీమ్ వర్క్, టీమ్ స్పిరిట్, బాడీ యాక్టివిటీస్ కి, మేనేజ్‌మెంట్, డిసిప్లిన్ నాయకత్వ లక్షణాలను మరింతగా అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. యువతలో ఫిట్నెస్‌పై అవగాహన పెంచే దిశగా జనసేన నాయకులు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు , యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



## బిజెపి ములుగు జిల్లా ఇన్చార్జిగా డాక్టర్ కొరడాల నరేష్

### శుభాకాంక్షలు తెలియజేసిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్

కూకట్ పల్లి, డిసెంబర్ 1 (నమస్తే ఉదయం) బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ కొరడాల నరేష్ కి ములుగు జిల్లా ఇన్చార్జిగా నియామకం చేసిన సందర్భంగా శేరిలింగంపల్లి కి సంబంధించిన పలువురు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా మోర్చా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా.నరేష్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినేపల్లి సాయికుమార్ సోమవారం డాక్టర్ కొరడాల నరేష్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు లంగటి నరేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేశవ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శులు దుర్గాప్రసాద్, మణి భూషణ్, జిల్లా కోశాధికారి కృష్ణంరాజు, సీనియర్ నాయకులు వీరయ్య చారి, నర్సింగరావు, నవీన్ గౌడ్, గోపాల్ రావు శేషయ్య, హైదర్ నగర్ డివిజన్ అధ్యక్షులు జి.అరుణ్ కుమార్, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు వంశి రెడ్డి, కూకట్ పల్లి పార్ట్ వన్ డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్, మహిళా మోర్చా నాయకురాలు సంధ్య, రజిని, కూకట్ పల్లి పార్ట్ వన్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మురళి కృష్ణ పటేల్, యువ మోర్చా అధ్యక్షులు రవికుమార్ యాదవ్, అవినాష్ పటేల్, యశ్వంత్, గిరీష్, వివేకానంద నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు రిపన్ రాజు, కొట్టే వేణు, రాజు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733